సాక్షి ప్రకాశం

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



జగనే రాష్ట్రానికి సమర్థవంతమైన నాయకుడు

సీఎం వైఎస్ జగనే రాష్ట్రానికి సమర్థవంతమైన నాయకుడని ఎమ్మెల్యే టీజేఆర్ అన్నారు. - 8లో..



టిప్పర్ ఢీకొని మహిళ మృతి

టిప్పర్ ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 33/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలి

- ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెవెన్యూ సర్వీసెస్ సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: అక్టోబర్ 1వ తేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రెవెన్యూ ఉద్యోగులు వీఆర్ఏల నుంచి డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో బొప్పరాజు పాల్గొని కౌన్సిల్ సమావేశంపై అసోసియేషన్ నాయకులకు పలు సూచనలు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. దీనిలో వీఆర్ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, వీఆర్ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, కలెక్టరేట్ అధ్యక్షుడు పూతకోలు శ్రీనివాసరావు, ఇతర నాయకులు పిన్నక మధుసూదన్‌రావు, డానియేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జూపూడి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జూపూడి ప్రభాకర్

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను మంగళవారం ప్రకాశం భవనంలో రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జ్ బొట్ల రామారావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కొండపి నాయకులు చింతల వెంకటేశ్వర్లు, బాలకోటిరెడ్డి, ప్రసాద్ ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, అన్నా వెంకట రాంబాబు, టీజేఆర్ సుధాకర్‌బాబు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు

గెలుపు బాధ్యత బాలినేనిదే

- కొండపితో సహా అన్ని నియోజకవర్గాలు కైవసం చేసుకుందాం
- ద్వితీయ, తృతీయ శ్రేణులందరినీ సమన్వయం చేసుకోవాలి
- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలి
- భిన్నాభిప్రాయాలన్నీ ఏకాభిప్రాయం చేయడంపైనే దృష్టి
- నియోజకవర్గాల నేతల సమీక్ష సమావేశంలో విజయసాయిరెడ్డి

ఒంగోలు: జిల్లా పార్టీ గెలుపు బాధ్యత మొత్తం బాలినేని శ్రీనివాసరెడ్డిదేనని దక్షిణ కోస్తా జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం నుంచి స్థానిక హోటల్ నోవాసిస్‌లో నియోజకవర్గాల వారీగా ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి సమావేశం ఒంగోలు నియోజకవర్గం గురించి జరిగింది. అదే విధంగా సంతనూతలపాడు, యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, వై.పాలెం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌తోపాటు నియోజకవర్గాల పరిశీలకులతోపాటు పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తొలుత పార్టీ నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం ఏం చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలను వ్యక్తం చేశారు. భారీ మెజార్టీ రావాలంటే అందుకు తగ్గ వ్యూహాన్ని ఇప్పటి నుంచే అమలు చేయాలని, అర్హులైన వారి ఓట్లు చేర్పించుకోవడం, దొంగ ఓట్లను గుర్తించే విషయంలో చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వారికి దిశా నిర్దేశం చేస్తూ పార్టీ నేతల మధ్య సమన్వయం చేయడమే సమావేశం ముఖ్య ఉద్దేశం అన్నారు. నాయకులందరూ కలిసికట్టుగా కృషిచేసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 40 వేల ఓట్ల మెజార్టీ సాధించే దిశగా దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరి సమస్యను తాను విన్నానని, తప్పకుండా వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ నేపథ్యంలో నేతలు సమైఖ్యంగా ఉంటూ ప్రతిపక్ష పార్టీల విమర్శలను తిప్పికొట్టాలన్నారు. 2019 ఎన్నికల్లో కొండపి మినహా అన్ని సీట్లను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుందని, ఈ దఫా ఆ నియోజకవర్గంలో సైతం జెండా ఎగరేసే బాధ్యతను బాలినేనికి అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో ఏవిధంగా అయితే ముందుకు సాగుతున్నామో అదేవిధంగా జిల్లాలో బాలినేని శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో పార్టీని ముందుకు తీసుకుపోతామని చెప్పారు. పార్టీ అన్న తరువాత భిన్నాభిప్రాయాలు ఉంటాయని అయితే వాటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితేనే పార్టీలో అంతర్గత పోరాటం ఉండదని చెప్పారు. జిల్లాకు సంబంధించి పార్టీ కార్యక్రమాలను బాలినేని శ్రీనివాస రెడ్డి భుజస్కందాలపై వేస్తున్నామన్నారు. పార్టీలో చిన్న చిన్న విభేదాలు ఉంటే వాటిని పరిష్కరిస్తూ బాలినేని పార్టీని బలపరుస్తారని వెల్లడించారు ద్వితీయ, తృతీయ శ్రేణులపై ప్రత్యేక దృష్టిసారించి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు.



వి.విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న మహిళా నాయకులు

తెలుగుదేశం పార్టీకి చివరి ఎన్నికలు:

ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నిప్పు అని చెప్పుకునే రోజులు పోయాయన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్లు దోపిడీకి గురయ్యేందుకు చంద్రబాబు కారణం కాబట్టే నేడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నాడన్నారు. చంద్రబాబు అవినీతి సామ్రాట్ అని, ఆయన విద్యాభ్యాసం నుంచే అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అటువంటి వ్యక్తిపై నేడు అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటిలోను చంద్రబాబు విచారణ ఎదుర్కోక తప్పదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కక్ష పూరితం లేదని కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు కూడా ఇప్పటికే ప్రభుత్వ సొమ్ము దోపిడీకి గురైనట్లు నిర్ధారించాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలోను యువతకు జరిగిన అన్యాయాన్ని స్పష్టంగా వివరించాలన్నారు. త్వరలో నియోజకవర్గ, ఆ తరువాత మండల స్థాయి సమీక్షలు కూడా ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మిగిలిన నేతలతో సమన్వయంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ వివరించాలని, ఏదైనా కారణాలతో అందని అర్హులకు సైతం అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి ఇవే చివరి ఎన్నికలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి

- జగనన్న చేదోడు లబ్ధిదారుల పనితీరు పరిశీలన
- వెంగముక్కపాలెంలో పరిశీలించిన బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని వెంగముక్కపాలెంలో జగనన్న చేదోడు లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. జగనన్న చేదోడు పథకంలో లబ్ధిపొందిన పాదర్తి



పాదర్తి ప్రసన్నతో మాట్లాడుతున్న జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు

ప్రసన్నతో ఆయన మాట్లాడారు. చేదోడు పథకంలో రజక వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్న ప్రసన్న రోజువారీ వృత్తి పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా ఇప్పటి వరకు మూడు సార్లు మొత్తం కలిపి రూ.30 వేలు ప్రభుత్వం నుంచి వచ్చిందని ఆమె వివరించింది. ఈ పథకం ద్వారా ఇస్త్రీ పెట్టె కొనుగోలు చేసుకొని ప్రతి రోజూ రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదిస్తున్నానని చెప్పింది. అదే విధంగా వెంగముక్కపాలెంలోని మరికొందరు జగనన్న చేదోడు లబ్ధిదారులతో కూడా ఈడీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క వెంగముక్కపాలెం గ్రామంలోనే 11 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో వెంగముక్కపాలెం వార్డు సచివాలయ సెక్రటరీ అంజయ్య పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో ఫారం 6, 7, 8 పెండింగ్ పూర్తి చేస్తాం

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మరో నాలుగు రోజుల్లో ఇంటింటి సర్వేలో భాగంగా చేపట్టిన ఫారం-6, 7, 8లో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. మంగళవారం ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ శ్రీలత ఇతర అధికారులు ప్రకాశం భవనం నుంచి పాల్గొన్నారు. దీనిలో కలెక్టర్ జిల్లా అంశాలను వివరించారు. గత ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన డెత్‌లు, షిఫ్టింగ్ ఓటర్ల వెరిఫికేషన్‌పై వివరించారు. ఇంటింటి సర్వేకు సంబంధించి పెండెన్సీ కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ జరుగుతున్నట్లు వివరించారు. ఎపిక్ కార్డులు పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఈఆర్ఓలు పాల్గొన్నారు.



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

వినాయక చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

- నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండపాలు, పందిళ్ల ఏర్పాటు కోసం తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ మలికా గర్గ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో నియమ నిబంధనలు తెలియజేశారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసిన మండపాల వద్ద భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు కూడా అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. మండే స్వభావం కలిగిన వస్తువులను ప్రతిమల దగ్గర ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ సిస్టమ్, రికార్డింగ్



ఎస్పీ మలికా గర్గ్ ఫైల్‌ఫొటో

డ్యాన్సులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం జరిగే సమయంలో ఆయా ప్రాంతాల్లో అన్నీ రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బందిని నియమించాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపాలిటీ విభాగాలతో సమన్వయం చేసుకొని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇలా ముందస్తు చర్యలు తీసుకోవాలి:

- వినాయక చవితి మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కూడిన కమిటీగా ఏర్పడి వారి వివరాలను సంబంధిత పోలీసు స్టేషన్లో తెలియజేయాలి.
- వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకున్న స్థలానికి చెందిన యజమాని లేదా సంబంధిత విభాగపు అధికారుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి.
- అగ్నిమాపక శాఖ, విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలి. నిబంధనల ప్రకారం పందిళ్లు, మండపాల వద్ద ఇసుక లేదా మంచినీళ్లను ఏర్పాటు చేసుకోవాలి.
- మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలు, ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో తగిన జాగ్రత్తలు వహించాలి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లాంటి ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైరింగ్ చేయించాలి.
- గణేష్ విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనానికి సంబంధించిన వివరాలను విధిగా తెలియజేయాలి. ఏమైనా మార్పులుంటే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- రాత్రివేళ మండపాల వద్ద నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రతినిధులు కాపలా ఉండాలి. రాత్రి వేళల్లో మండపాల వద్ద విలువైన వస్తువులను ఉంచరాదు. మండపాలు, పందిళ్ల వద్ద శబ్దకాలుష్య క్రమబద్ధీకరణ, నియంత్రణ నిబంధనలు-2000 ప్రకారం స్పీకర్లను ఉపయోగించాలి. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను ఉపయోగించాలి.
- రోడ్లపైన విగ్రహాలను పెట్టరాదు. రోడ్లపై ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలిగించేలా ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేయరాదు. ఊరేగింపు సమయంలో పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు, అధిక శబ్దం వచ్చే వాయిద్యాలకు అనుమతి లేదు.
- నిమజ్జనానికి ఉపయోగించే వాహనం మంచి కండీషన్లో ఉండేలా జాగ్రత్త పడాలి. అలాగే లైసెన్స్, అనుభవం కలిగిన డ్రైవర్లను నియమించాలి.
- ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటే వెంటనే పోలీసు అధికారులకు తెలియజేయాలి. డయల్ 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చే వారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

సాయిబాబా సెంట్రల్ స్కూల్,
సాయిబాబా నగర్, పెళ్లూరు,
ఒంగోలు కార్పొరేషన్,
క్విస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్,
పొందూరు రోడ్డు, వెంగముక్కపాలెం,
ఒంగోలు కార్పొరేషన్

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010357744

అపరాధ రుసుంతో పరీక్ష రాసేందుకు 16 వరకు అవకాశం

ఒంగోలు: ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్టు పరీక్ష రాసేందుకు అపరాధ రుసుంతో ఈనెల 16వ తేదీ వరకు అవకాశాన్ని పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 పరీక్ష రుసుముతోపాటు అదనంగా రూ.60 అపరాధ రుసుం చెల్లించాలన్నారు. దరఖాస్తును జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 17వ తేదీలోగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

అనుమతి పొందిన పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యానవన శాఖకు సంబంధించి అనుమతులు పొందిన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి పలు అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యానవన పనులకు అనుమతి పొందిన ప్రాంతాల్లో వెంటనే మొక్కలు నాటాలన్నారు. వాటికి సంబంధించిన నగదును వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. సగటు వేతనం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రివైజ్డ్ రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకుని పనులు వేగంగా పూర్తి



మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చేయాలన్నారు. ఏపీడీలు దీనిపై మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

సచివాలయాల్లో సిబ్బంది బయోమెట్రిక్ హాజరు ఉదయం, సాయంత్రం ఖచ్చితంగా వేయాలన్నారు. సేవలకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం, అగ్రికల్చర్, హార్టీకల్చర్, పశు సంవర్ధక శాఖ, జగనన్న పాలవెల్లు తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. కేటాయించిన అన్నీ పనుల్లో పురోగతి సాధించేలా పనిచేయాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు ఎలక్షన్, రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్మీ జవాన్ అరెస్టు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె పంచాయతీ పరిధిలోని సంగపేట గ్రామానికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకుంటానని మోసగించిన ఆర్మీ జవాన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై జి.కృష్ణపావని తెలిపారు. అనుమలవీడు గ్రామానికి చెందిన పిన్నిక పవన్‌కుమార్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. సెలవుపై వచ్చినపుడల్లా ఆ యువతితో చనువుగా ఉంటూ ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసగించాడని ఈ నెల 4వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితున్ని ఆదివారం అరెస్టు చేశారు. గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై కృష్ణపావని తెలిపారు.

మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం

కంభం: మానసిక దివ్యాంగురాలైన ఓ బాలిక(15)పై ఓ మృగాడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన కంభం మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన చాగోలు లక్ష్మయ్య అనే 47 ఏళ్ల వయసున్న వ్యక్తి మానసిక దివ్యాంగురాలిపై కన్నేశాడు. మంగళవారం ఆ బాలికను కాలనీలోని ఓ గృహంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు యువతి తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అశ్లీల వీడియో కాల్స్

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కార్యకర్తల సెల్‌ఫోన్‌లకు గుర్తు తెలియని వ్యక్తి అశ్లీల వీడియో కాల్స్‌తో వేధిస్తున్నాడని సోమవారం పలువురు ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతికి ఫిర్యాదు చేశారు. యర్రగొండపాలెం సెక్టార్ పరిధిలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లోని కార్యకర్తలకు ఈ ఫోన్ కాల్స్ వస్తున్నాయని వారు ఆరోపించారు. సెల్ నంబర్లు డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినవి కావడంతో వరుసగా ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తమ శాఖకు చెందినవారు చేస్తున్నారని కాల్‌ను రిసీవ్ చేసుకుంటే అందులో అశ్లీలత కనిపిస్తుందని వారు ఆరోపించారు. తిరిగి ఆ ఫోన్‌కు కాల్ చేస్తే రెస్పాన్స్ ఉండటంలేదని వారు తెలిపారు. ఈ విషయం గురించి సీడీపీవోను ప్రశ్నించగా అశ్లీల వీడియోకాల్స్ వస్తున్నాయని కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ శాఖకు జరిమానా

ఒంగోలు: విద్యుత్ శాఖకు ఒంగోలు వినియగదారుల కమిషన్ జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. స్థానిక ఎన్‌జీవో కాలనీ వాసి అయిన అన్నమనేని హరిబాబు తాను నిర్మించుకున్న గృహానికి, రేకుల షెడ్డుకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు కోసం తగిన రుసుం చెల్లించారు. అయినా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మీటర్లు కేటాయించలేదు. దీంతో హరిబాబు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విని పూర్వాపరాలను పరిశీలించిన కమిషన్ వినియోగదారుడికి సకాలంలో సేవలు అందించడంలో విద్యుత్ శాఖ వైఫల్యం చెందినట్లు నిర్ధారణకు వచ్చింది. దీంతో వినియోగదారుడి నివాసంలో 45 రోజుల్లోగా రెండు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడంతోపాటు అతనికి మానసిక వేదన కలిగించినందుకు జరిమానాగా రూ.5 వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.2 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు దుగ్గెంపూడి శ్రీదేవి, సభ్యులు వై.సుందరరావు, డాక్టర్ ఎస్‌పి సమీరా తీర్పు వెలువరించారు.

15న ఎస్‌జీఎఫ్ హాకీ, రెజ్లింగ్ ఎంపిక పోటీలు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 15న అండర్–14, అండర్–17 జిల్లా స్థాయి హాకీ, రెజ్లింగ్ క్రీడా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల విద్యార్థులు అర్హులని స్పష్టం చేశారు. ఎంపిక కార్యక్రమం సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో పేరు నమోదు చేయించుకుని ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. అండర్–14 విభాగంలో పాల్గొనేవారు 2,010 జనవరి ఒకటో తేదీ లోగా, అండర్–17 విభాగంలో పాల్గొనేవారు 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని వి.బైలు గ్రామ సమీపంలోని అడవిలో మంగళవారం వేకువజామున బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపారు. అడవిలో నాటుసారా తయారీకి యత్నిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కాపుకాచి దాడులు నిర్వహించగా అక్కడ నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. వి.బైలు గ్రామానికి చెందిన గండు యర్రయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగనే రాష్ట్రానికి సమర్థవంతమైన నాయకుడు

- 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఏం చేశాడు..?
- చంద్రబాబునాయుడు నాయకుడు కాదు.. కార్పొరేట్ శక్తుల సీఈఓ
- చెప్పుకోవడానికి చంద్రబాబుకు ఒక్క సంక్షేమ పథకమైనా ఉందా..?
- సంతనూతలపాడు గడ్డకు రుణపడి ఉంటా..
- సాక్షితో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


సంతనూతలపాడు గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు(ఫైల్)

చీమకుర్తి: ' సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రూ.3 లక్షల కోట్లు మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ప్రజలకు ఏమిచ్చాడు, ఏం చేశాడ'ని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. ప్రకాశం జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తిచేసిన మొట్టమొదటి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు. ఈ సందర్భంగా సాక్షితో ఎమ్మెల్యే మాట్లాడారు. చంద్రబాబు నాయుడు స్వతహాగా నాయకుడు కాదని, కార్పొరేట్ శక్తులు తయారు చేసుకున్న ప్రతినిధి అని అందుకే ఆయనే రాష్ట్రానికి తాను సీఈఓ అని స్వయంగా ప్రకటించుకున్నారన్నారు. కానీ ప్రజలు తమకు సమర్థవంతమైన నాయకుడు కావాలని, జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందా..?

14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకోవడమే తప్ప చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేముందని ప్రశ్నించారు. రైతులకు, రుణమాఫీ చేస్తానని చేశాడా..? నిరుద్యోగభృతి ఇస్తానన్నాడు ఇచ్చాడా..? అమరావతి, పోలవరాన్ని కడతానన్నాడు..కట్టాడా..? ఎక్కడో ఎందుకు ప్రకాశం జిల్లాకు పేపర్ మిల్లు, విమానాశ్రయం, రామాయపట్నం తెస్తానన్నాడు...తెచ్చాడా..?వెలుగొండ పూర్తి చేశాడా..? కనపర్తిలోని భూములన్నీ ఆయన పాలనా కాలంలో బీళ్లుగా పెట్టాడని, ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన చేసిన పనులేమిటో టీడీపీ నేతలే చెప్పుకోలేని దుస్థితి ఉందన్నారు. మంచి పథకం తెచ్చానని చెప్పుకోవడానికి కూడా ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సగర్వంగా చెప్పుకునేలా అమ్మఒడి, నాడు–నేడు, వైఎస్సార్ ఆసరా, చేయూత, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాల ద్వారా పేదలకు మూడు లక్షల కోట్ల రూపాయలను అందించారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని, అందుకే జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతమైన నాయకుడిగా ప్రజలు గుర్తించారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు.

ఇందిర, వైఎస్సార్ తర్వాత ఆ గుర్తింపు సీఎం జగన్‌కే

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఇందిరాగాంధీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అదే గుర్తింపు వారి తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన పార్టీలు చూడలేదు. కులం చూడలేదు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలలో నగదును అందించి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేశారని తెలిపారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతీక సచివాలయ వ్యవస్థ

ప్రజలకు నేరుగా వారి ఇళ్ల వద్దకే పాలనాపరమైన సేవలను అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. రేషన్‌కార్డు, పింఛన్లు, వ్యవసాయ రంగంలో యంత్రాలు, ఎరువులు ఇలా ప్రజలు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతకు కావాలసిన సదుపాయాలు, సౌకర్యాలన్నీ గ్రామాల్లోనే అందించాలన్న గాంధీ, అంబేడ్కర్ కోరుకున్న గ్రామ స్వరాజ్యం, సుపరిపాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు.

సంతనూతలపాడు గడ్డకు రుణపడి ఉంటా

'నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రంలో 2022 మే 13న గడప గడపకన మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించాను. 16 నెలల్లో 84 సచివాలయాల పరిధిలో 91 వేల గడపలను తిరిగాను. నియోజకవర్గంలో తాను తిరగని ఊరు, గడప, బజారు లేనే లేవు. ప్రతి ఊరిలో ప్రజలంతా తనతో పాటు తిరిగిన మండల, గ్రామస్థాయి నాయకులను వరుసలు పెట్టి అన్నా, బాబాయ్, మామయ్య అంటూ ఆప్యాయంగా పలకరించారు. ప్రతి ఇంటికి స్థానిక నాయకులే ఆప్యాయంగా తీసుకువెళ్లి ఇంట్లో జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలను తెలియజేశారు. ఇంతటి ఆదరాభిమానాలు చూపిన సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజల రుణం ఏమిచ్చి తీర్చుకున్నా తీరేది కాదన్నారు. త్వరలో సంతనూతలపాడులో విజయోత్సవ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సస్యరక్షణతోనే నాణ్యమైన పొగనారు

కొండపి(సింగరాయకొండ)/జరుగుమల్లి: పొగనారు మడుల్లో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని టుబాకో బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ ఎం.కృష్ణశ్రీ సూచించారు. కొండపి పొగాకు బోర్డు కార్యాలయంలో మంగళవారం పొగనారు మడులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రొడక్షన్ మేనేజర్ మాట్లాడుతూ.. పొగాకు పంట నియంత్రణ ఆవశ్యకతను వివరించి, ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కందుకూరు సీటీఆర్‌ఐ శాస్త్రవేత్త డాక్టర్ అనూరాధ మాట్లాడుతూ.. పొగనారుమడిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అలాగే జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు గ్రామంలో రైతు పైడి కృష్ణయ్య సాగు చేసిన నారుమడిని టుబాకో బోర్డు అధికారులు పరిశీలించారు. విత్తనాల రకం, విత్తన మోతాదు, నారు మడికి వాడిన ఎరువులు, ఇతర ఖర్చుల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. ఆయా


వావిలేటిపాడులో పొగనారు మడులను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు


కొండపిలో రైతులకు సూచనలిస్తున్న పొగాకు బోర్డు అధికారులు

కార్యక్రమాల్లో పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ జి.దామోదర్, ఐటీసీ కంపెనీ శాస్త్రవేత్త డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఓ జి.సునీల్‌కుమార్, టి.సాయికుమార్, ఐటీసీ కంపెనీ జనరల్ మేనేజర్ శివకుమార్, టంగుటూరు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, సీనియర్ గ్రేడ్ అధికారి సిద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. పెద్దమ్మ తల్లో...


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి


బోనాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట గ్రామంలో మంగళవారం రాచూరి పెద్దమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతోపాటు వడ్డెర కాలనీవాసులు బోనాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని మొక్కులు చెల్లించారు. గ్రామస్తులతోపాటు వడ్డెర కాలనీ వాసులు ముందుగా గ్రామదేవతలకు పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌ను వేదపండితుడు నారాయణశర్మ ప్రత్యేకంగా అలంకరించి ఉభయదాతలతో సహస్రనామ పూజలు చేయించారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు: మండలంలోని రెడ్డి నగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రాముడు పాలెం తండాకు చెందిన పి. చెంగానాయక్ మంగళవారం సాయంత్రం సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై దర్శికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని రాత్రి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా మార్గ మధ్యలో దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో రెడ్డినగర్ వద్ద రోడ్డుపైన ఉన్న హెచ్చరిక బోర్డును ఢీ కొట్టాడు. తలకి తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన చెంగా నాయక్

108లో గర్భిణి ప్రసవం


శిశువును చూపుతున్న 108 సిబ్బంది

అర్ధవీడు (కంభం): 108 వాహనంలో ఓ గర్భిణి ప్రసవించిన సంఘటన మండలంలోని అర్ధవీడులో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అర్ధవీడు గ్రామానికి చెందిన షేక్ ఆశ అనే గర్భిణికి పురిటి నొప్పులు రాగా 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు బయల్దేరారు. మార్గంమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఆ మహిళకు వాహనంలోనే ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మించింది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. 108 వాహన సిబ్బంది ఇలియాజ్, భాస్కర్‌కు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహిళను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మూడు గృహాల్లో చోరీ

గుడ్లూరు: తాళాలు వేసి ఉన్న గృహాలే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయి వరుసగా ఉన్న మూడు గృహాల్లో చోరీకి పాల్పడిన సంఘటన గుడ్లూరులోని మిట్టపాలెంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. మిట్టపాలెంలో నివాసం ఉండే కందుల రమా,కందుల కాంతమ్మలు తమ ఇళ్లకు తాళాలు వేసుకొని బంధువుల వద్దకు వెళ్లారు. అలాగే కందుల చిట్టెమ్మ అనే మహిళ సోమవారం రాత్రి తన ఇంటికి తాళం వేసుకొని కొద్ది దూరంలో ఉన్న కూతురు ఇంటికి వెళ్లి పడుకుంది. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపుకు ఉన్న తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు కూడా తెరిచి ఉండటంతో చుట్టు పక్కల వారికి తెలియచేసింది. అలాగే ఆమె ఇంటి పక్కనే ఉన్న రెండు ఇళ్లల్లో కూడా తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటాన్ని యువకులు గుర్తించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాదరెడ్డి చోరీ జరిగిన మూడు గృహాలను పరిశీలించారు. చిట్టెమ్మ ఇంట్లో బీరువాలో ఉన్న బట్టలు అన్ని కింద పడవేసి పర్సులో దాచిపెట్టి ఉన్న రూ.10 వేలు నగదును దొంగలు అపహరించినట్లు ఆమె పోలీసులకు తెలిపింది. అలాగే మిగతా రెండు గృహాల్లో నగదు, విలువైన వస్తువులు లభించకపోవడంతో వస్తువులన్నీ చిందరవందరగా పడేసి దొంగలు వెళ్లిపోయినట్లు గుర్తించారు. మూడు గృహాలు చివర ఉండటంతో అర్ధరాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్సై ప్రసాదరెడ్డి తెలిపారు. ఒకే రోజు వరుసగా మూడు ఇళ్లల్లో దొంగలు పడటంతో మిట్టపాలెం వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు గస్తీని పెంచుతామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని మహిళ దుర్మరణం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు


రాఘవకుమారి (ఫైల్)

చీమకుర్తి: సంతనూతలపాడులో టిప్పర్ ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన ఏల్చూరి రాఘవకుమారి(35) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన సంతనూతలపాడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంతనూతలపాడుకు చెందిన రాఘవకుమారి తన భర్త నరసింహారావు, మరో పాపతో కలిసి స్కూటీపై ఒంగోలులోని వారి కుమార్తె వద్దకు వెళ్లి వస్తున్నారు. కొద్ది క్షణాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వారిని టిప్పర్ రూపంలో మృత్యువు వెంటాడింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వారు ప్రయాణిస్తున్న స్కూటీని వెనుక నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొనడంతో నరసింహారావు, పాప రోడ్డు పక్కన పడిపోయారు. రాఘవకుమారి టిప్పర్ టైర్ల కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఆంజనేయులు పరిశీలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్పీడ్‌గన్‌తో ప్రమాదాల నివారణ

- గత రెండు రోజుల్లో 45 కేసుల నమోదు
- ఆర్‌టీఓ అమర్‌నాయక్


వాహనాల స్పీడును పరిశీలిస్తున్న ఆర్‌టీఓ

మార్కాపురం: స్పీడ్‌గన్‌తో నేషనల్ హైవేపై వేగనియంత్రణ చేసి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు మార్కాపురం ఆర్టీఓ అమర్‌నాయక్ తెలిపారు. గత రెండు రోజులుగా మార్కాపురం హైవే రోడ్లపై స్పీడ్‌గన్‌పెట్టి సుమారు 45 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జాతీయ రహదారి 544డి పై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావుతో కలిసి మంగళవారం స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలించి పరిమితికి మించి వేగంతో వస్తున్న పలువురు వాహనదారులకు జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవేపై ఈ మిషన్‌గన్‌ను ఏర్పాటు చేసి స్పీడ్ కంట్రోల్‌తో పాటు యాక్సిడెంట్లను నివారిస్తామని తెలిపారు. ఈ గన్ ఏర్పాటు ద్వారా ఓవర్‌స్పీడ్‌తో పాటు వాహనాల యజమానుల సెల్‌ఫోన్లకు చలానా పంపుతామని తెలిపారు. పరిమితికి మించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణం కావద్దని వాహనదారులకు సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ లిక్కర్ తాగి డ్రైవ్ చేస్తే కచ్చితంగా ప్రమాదాలు జరుగుతాయని, ఇదే సమయంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. టర్నింగులు, మూలమలుపులు, జంక్షన్లు, క్రాస్‌రోడ్స్, రద్దీ రోడ్లపై నిదానంగా వెళ్లాలని పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ఓపెన్ 10th, వన్‌సిట్టింగ్ ఇంటర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు జరుగుచున్నవి. సంప్ర॥ విజయభారతి కోచింగ్ సెంటర్, అంజయ్య రోడ్, ఒంగోలు. ✆ 99497 89361 [O-191489]

Services

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సం॥ ✆ 96590 57777. [O-191608]

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ ✆ 76508 91999 [B-788219]

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్) సంప్ర : ✆ 945 945 3338 [B-490]

Wanted

■K.V.R.స్టార్‌లైట్ మెడికల్ అకాడమీ-ఒంగోలు లో పనిచేయుటకు లేడీవార్డెన్లు, స్టూడెంట్ ఇన్‌ఛార్జ్‌లు, వాచ్‌మెన్లు వెంటనే కావలెను. ✆ 94921 19926, 88991 19988. [O-191607]

■ప్రముఖ విద్యాసంస్థలలో 10th Physics. VII లోపు English, Science బోధించుటకు ఉపాధ్యాయులు కావలెను. భోజనవసతి కలదు. ✆ 77991 55998, 89191 45066 [O-191498]

■ఈస్ట్ గంగవరం తాళ్ళూరు (M) E.M. స్కూల్ నందు 4th క్లాస్ నుండి 9th క్లాస్ వరకు English సబ్జెక్ట్ బోధించుటకు ఫ్యాకల్టీ కావలెను. హాస్టల్ వసతి కలదు ✆ 99120 11805, 93982 16423 [O-191499]

■సాయిరత్న ఫిల్లింగ్ స్టేషన్ కర్నూల్‌రోడ్, ఒంగోలు, RTC డిపో ప్రక్కన పెట్రోల్ బంక్ నందు ఆయిల్ ఫిల్ చేయుటకు పంప్ బాయ్స్ / గర్ల్స్ కావలెను. జీతం 12000/-✆ 93469 32406 [O-191495]

■విజయకౌటిల్య ఎంటర్ ప్రైజెస్, ఒంగోలు నందు పనిచేయుటకు (బొలెరో, టాటాఏస్) డ్రైవర్ కం డెలివరి బాయ్స్-2 & సేల్స్‌మెన్లు-2 కావలెను. సంప్ర॥ ✆ 92464 61372 [O-191493]

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02856 90102 02762

■నెల్లూరు జిల్లా ప్రముఖ Power Plant నందు పని చేయుటకు Ex. Army Guards కావలెను. జీతం: 8 గం॥ - 33,800, సెక్యూరిటీ Cum Computer Operator కావలెను. జీతం: 8 గం॥- 17,500. ఉచిత వసతి కలదు. Max Security Agency, NLR. 77309 44033, 94082 03995. [NA-5860]

■మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221616]

■సెక్యూర్ సెక్యూరిటీ సర్వీసెస్ ఒంగోలు డిస్ట్రిక్ట్ కొండేపి పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASOలు, గార్డ్స్, లేడీ గార్డ్స్ కావలెను. సంప్ర : 99595 98279. [NA-22495]

■హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, హైదరాబాద్ ఫోన్:9640258899, విజయవాడ:9640648899 [HA-590]

■చీరాల Meesho లాజిస్టిక్‌లో పనిచేయుటకు టూవీలర్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. జీ:20000–25000/– సంప్ర: 8374533334, 8187818726 [G-751713]

■ఒంగోలు సిటీ, కందుకూరు, ఎర్రజెర్ల వెంగముక్కపాలెం, ఒంగోలు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 13వేలు+ సబ్సిడీ మీల్స్ కలవు. 6302252456, 7286789727 [G-7650]

■ప్రకాశం జిల్లా నందు NHAI Maintenance Project నందు పని చేయుటకు సివిల్ ఇంజనీర్స్ మరియు సూపర్‌వైజర్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి: 98495 28869. [N-1231200]

■Wanted Hospital Manager and Staff for a multi Speciality Hospital in Ongole. Contact. ✆ 89847 24999 [O-191497]

■Wanted English and Hindi Teachers for 6th to 10th Classes at Deepsika Public School Kakarla ✆ 89789 35396, 80746 38228 [O-759028]

■Wanted Teachers M/F to Teach 3rd to 7th Class in English, Masth's & PET, Nursary to IInd Class for all Subjects. Sri Ram School ✆ 98491 07773 - Ongole. [O-191613]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com